నాడు – నేడు





ఒక చిన్న ఆలోచనతో..
బాగు'బడి'


- శిథిలమైన సర్కారు బడికి కొత్త హంగులు
- రూ.60 లక్షలతో నూతన భవనం నిర్మాణం
- ప్రజాప్రతినిధి చొరవ.. స్పందించిన దాత..
- సిద్ధాంతిలో నేడు పాఠశాల భవనం ప్రారంభం
- కార్యక్రమానికి సినీ నటుడు సోనుసూద్ రాక

శంషాబాద్: ఒక చిన్న ఆలోచన శిథిలమైన సర్కారు బడిని బాగు చేసింది. రేపటి పౌరులను తీర్చిదిద్దే పాఠశాలకు కొత్త రూపు తీసుకొచ్చింది. ఇది మా బడి అని విద్యార్థులు గర్వంగా చెప్పుకునేలా ముస్తాబైంది. ప్రజాప్రతినిధి చొరవతో స్వచ్ఛందంగా ముందుకొచ్చిన దాత సహకారంతోనే ఈ అద్భుతం ఆవిష్కృతమవుతోంది.. శిథిలమైన సిద్ధాంతి హరిజనవాడ ప్రాథమిక పాఠశాల కొత్త భవనం నేటి నుంచి విద్యార్థులకు అందుబాటులోకి రానున్నది.

ఆలోచనతో..

స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేశ్ ముదిరాజ్ తాను బాల్యంలో బలపం పట్టిన పాఠశాల దుస్థితిని తన స్నేహితుడైన స్థిరాస్తి వ్యాపారవేత్త, శంషాబాద్ కాపుగడ్డ వాసి కందకట్ల సిద్దురెడ్డితో పంచుకున్నాడు. వారి మధ్యన జరిగిన ఓ సంభాషణ కాస్తా మంచి పనికి దోహదం చేసింది. పాఠశాల భవనాన్ని తాను సొంత ఖర్చులతో నిర్మిస్తానని సిద్దురెడ్డి ముందుకొచ్చారు. ఏడాది కిందట రూ. 30 లక్షల అంచనాతో పనులు ప్రారంభించారు. మొత్తం ఏడు గదులు, వంట గది,అత్యాధునిక బాత్‌రూంలు, నాణ్యమైన కొత్త ఫర్నీచర్‌తో పాటు అన్నింటిని సిద్దురెడ్డి అందులో సమకూర్చారు. అయితే అంచనా రెండింతలై ఖర్చు రూ.60 లక్షలు దాటింది. అయినా ఎక్కడా వెనకంజ వేయకుండా కార్పొరేట్ స్థాయి హంగులతో పాఠశాల భవనం ముస్తాబైంది. పాఠశాల భవనంపై విద్యార్థులకు స్ఫూర్తి నింపేలా ఓ పెద్ద పుస్తకం కూడా ఏర్పాటు చేయడంతో మరింత ఆకర్షణీయంగా మారింది. పెయింటింగ్ బొమ్మలు, సూక్తులు ఇలా అన్ని హంగులతో అదో కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా తయారైంది. కాగా సిద్దురెడ్డి సర్కారు బడికి రూ.60 లక్షలను ఖర్చు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిద్దురెడ్డి చేసిన సేవా కార్యక్రమాలతో పాటు పాఠశాల భవన నిర్మాణం చేయడంపై సినీ నటుడు సోనుసూద్ హర్షం వ్యక్తం చేస్తూ ఇటీవల వీడియో సందేశం పంపారు. సోమవారం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా ఆయన ముఖ్య అతిథిగా రానున్నట్లు సిద్దురెడ్డి సాక్షికి తెలిపారు. పాఠశాలను బాగుచేసే అవకాశం దక్కడాన్ని అదృష్టంగా భావిస్తున్నాని ఆయన చెప్పారు. నా స్నేహితుడు సిద్దురెడ్డి ఒక మంచిపనికి ముందుకు రావడం సంతోషం కలిగించిందని 17వ వార్డు కౌన్సిలర్ వెంకటేశ్ తెలిపారు.


తరగతి గదుల్లో సమకూర్చిన కొత్త ఫర్నీచర్


కందకట్ల సిద్దురెడ్డి
- భవన నిర్మాణ దాత

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 19న (నేడు) ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

రేపు చలో సెక్రటేరియట్

శంషాబాద్ రూరల్: ధూప, దీప నైవేద్య అర్చకుల సమస్యలు పరిష్కరించాలి డిమాండ్ చేస్తూ ఈ నెల 20న (నేడు) చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సుబ్రహ్మణ్యశర్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాదు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో సీఎం, దేవాదాయ శాఖ మంత్రికి వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్చకులకు ఇస్తున్న గౌరవ వేతనంతో జీవించడం భారంగా మారిందని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్తగా నియమితులైన వారి ఏడు నెలల జీతాన్ని చెల్లించాలనే ఎజెండాతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం


విజయలక్ష్మి

శంషాబాద్ రూరల్: యువతి అదృశ్యమైన ఘటన బహదూర్‌గూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దానయ్య, లక్ష్మయ్య దంపతులు ఈ నెల 15న కూలీ పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి వారి కూతురు విజయలక్ష్మి (19) కనిపించలేదు. ఆమెతో పాటు ఇంట్లో దాచిన బంగారు, వెండి నగలు, నగదు బ్యాగు తీసుకుని బయటకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎండిపోయిన వరి పంటను చూపిస్తున్న రైతు ఎల్లయ్య



ఎండుతున్న పంటలు

- లోవోల్టేజీతో కరెంట్ సరఫరాకు అంతరాయం
- అన్నదాతల ఆందోళన
- అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విన్నపం

శంషాబాద్ రూరల్: లోవోల్టేజీ సమస్య రైతులను వేధిస్తున్నది. తరచూ ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంట్ సరఫరా నిలిచిపోతుండడంతో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని రాయన్నగూడ పరిధిలో గల ట్రాన్స్‌ఫార్మర్‌కు 20 రోజులుగా కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరి సాగుకు ఇబ్బందులు..

ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో 13 బోర్లు ఉన్నాయి. ఈ నీటితోనే రైతులు సుమారు 30 ఎకరాల్లో వరి, కూరగాయలు, పూల సాగు చేస్తున్నారు. అయితే తరచూ ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడి ఫ్యూజులు ఎగిరిపోయి కరెంట్ నిలిచిపోయి బోర్లు నడవడం లేదు.దీంతో పంటలకు సాగునీరు అందకుండా పోతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ చేయాలని, లేకుంటే ఉన్న పంటలు కూడా చేతికి రాకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రాయన్నగూడలో అధిక లోడుతో మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

శాస్త్రిపురంలో ఎమ్మెల్సీ పర్యటన


బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్, మాజీ కార్పొరేటర్

రాజేంద్రనగర్: శాస్త్రిపురం డివిజన్ పరిధిలో మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ ఆదివారం పర్యటించారు. మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరీఫ్‌తో కలిసి ఆయన దానమ్మ జోపిడీ, అన్సారీ రోడ్డు ప్రాంతంలోని బస్తీలు, కాలనీల ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు.

ముగిసిన అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు


విజేతలను ప్రకటిస్తున్న కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. మొత్తం 527 మంది ఓటర్లకు 476 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో ఓట్లను లెక్కించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కె.రాజ్ కుమార్, కోశాధికారిగా జి.చందు, జనరల్ సెక్రటరీగా ఎం.నరేశ్ గెలుపొందారు. ఓటింగ్ సందర్భంగా రాజేంద్రనగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటింగ్ నేపథ్యంలో బుద్వేల్ బస్తీ సందడి నెలకొన్నది.

ఓంనగర్‌కాలనీకి బస్సు సౌకర్యం కల్పించండి

బండ్లగూడ: బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఓంనగర్ కాలనీ వాసులు ఆదివారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి అనేక మంది విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం నగరానికి వెళ్తుంటారని, ఉదయం, సాయంత్రం సమయంలో బస్సులు లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తుందన్నారు. అలాగే ఆటోలను ఆశ్రయిస్తే ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ గుండా మెహిదీపట్నం, సికింద్రాబాద్, కోటి తదితర ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో పాటు రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని వారు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో చర్చించి ఓంనగర్ కాలనీ గుండా బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ప్రజా సమస్యలను సైతం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోకరి సురేశ్‌గౌడ్, ఓంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నవీన్‌ముదిరాజ్, మల్లారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

మణికొండ: వాసవీ క్లబ్ కపుల్స్, శ్రీతేజ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా మణికొండ వాసవీ క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ పోషకాహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ కపుల్స్ కార్యదర్శి యశ్వంత్, కోశాధికారి నిరీష, జోన్ చైర్మన్ కె. నిరీష, రిజీయన్ చైర్మన్ జి.నవీన్‌కుమార్, రీజీయన్ కార్యదర్శి రామ్ సురేశ్, జిల్లా ఇన్‌చార్జి కిరణ్ కుమార్, డాక్టర్లు రంజిత్, హిరణ్మయి పాల్గొన్నారు.


క్యాంప్‌లో పాల్గొన్న అలకాపూర్ టౌన్‌షిప్‌వాసులు

నిర్మాణ పనులతో నిత్యం ఇబ్బందులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ కన్‌స్ట్రక్షన్స్‌తో వచ్చే కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ అపర్ణ సరోవర్, అపర్ణ గ్రాండే, అపర్ణ జెన్నిత్ సముదాయాలలో నివాసం ఉండే సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఉద్యోగులు తదితరులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపట్టిన నిర్మాణాలతో నిత్యం ఇబ్బందుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా సెల్లార్ల పనులు చేస్తుండటంతో రాత్రి వేళ శబ్దాలతో నిద్రపోలేక పోతున్నామన్నారు. అదే విధంగా సెల్లార్లు తవ్వే సమయంలో వచ్చే డస్ట్ విపరీతంగా ఉంటుందని, చుట్టూరా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు తవ్వేటప్పుడు వాటర్ చల్లడం ద్వారా డస్ట్ లేవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో శబ్దాలు రాకుండా చూడాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అపర్ణ సరోవర్, అపర్ణ గ్రాండే, అపర్ణ జెన్నిత్ నివాసితులు పాల్గొన్నారు.





స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..

- ఔటర్ సర్వీసు మార్గాల్లో కనిపించని వేగ నియంత్రణ చర్యలు
- ప్రమాదాల బారిన వాహనదారులు

శంషాబాద్ రూరల్: ఓఆర్ఆర్ మార్గంలోని సర్వీసు దారుల్లో స్పీడ్ బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శంషాబాద్, మహేశ్వరం మండలం పరిధిలో ఉన్న ఔటర్ రింగు రోడ్డు సర్వీసు దారుల్లో గతంలో ఇరువైపులా స్పీడు బ్రేకర్లు ఉండేవి. కొన్నాళ్ల కిందట వీటిని ఒక్కొక్కటిగా తొలగించారు. దీంతో వేగ నియంత్రణ లేక ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. అంతేగాకుండా అతి వేగంతో వస్తున్న వాహనాలు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాలువల్లో పడిపోతుండడంతో వాహనదారులు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రధాన కూడళ్లలో ప్రమాదకర పరిస్థితులు..

ఔటర్‌పై ఉన్న ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి.పెద్దగోల్కొండ, తుక్కుగూడ, ఆదిబట్ల, టోల్‌గేట్ల ప్రాంతాలు, అండర్‌పాస్‌ల వద్ద భారీ వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పెరిగిన ట్రాఫిక్..

ఔటర్ సర్వీసు మార్గాల్లో వాహనాల రద్దీ పెరిగింది. ముఖ్యంగా భారీ వాహనాలు, ట్రక్కులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గాల్లో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ద్విచక్ర, కార్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో స్థానికులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీసు మార్గాల్లో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా పెద్దగోల్కొండ వద్ద ఔటర్ సర్వీసు మార్గం

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


శేరిలింగంపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కులగణన తీర్మానం చేశారని, అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బీసీ ఐక్య వేదిక నాయకులతో కలిసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కులగణనకు శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. కార్యక్రమంలో వీరేందర్‌గౌడ్, బేరి రాంచందర్ యాదవ్, ఆర్‌కె సాయన్న ముదిరాజ్, రమేష్ యాదవ్, నర్సింగ్ ముదిరాజ్, నర్సింహులు ముదిరాజ్, మక్బూల్, నవాజ్, తిరుపతి, సెల్వరాజ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామికి పల్లకీసేవ

రాయదుర్గం: రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం ఆలయంలో బాలబోగం, అర్చన, బలిహరణ, ఆరాధన తదితర పూజలను నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవతో పాటు స్వామివారికి వాహనసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో 'గోల్డ్'

పోటీకి దిగితే బంగారు పతకమే..
నేషనల్స్‌కు ఆడటమే తన టార్గెట్ అంటున్న తేజస్వరి


ప్రాక్టీస్ చేస్తున్న తేజస్వరి


తేజస్వరిని అభినందిస్తున్న బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు

శేరిలింగంపల్లి: చదువుతో పాటు స్కేటింగ్ లోనూ రాణిస్తోంది తేజస్వరి. స్కేటింగ్‌లో ఆమె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. ఏడేళ్ల వయస్సు నుంచే స్కేట్ 9 అకాడమీలో కోచ్ విశల్ ఆధ్వర్యంలో స్కేటింగ్‌లో శిక్షణ తీసుకుంది. జాతీయస్థాయిలో జరిగిన అనేక పోటీల్లో పాల్గొని పలు పతకాలను సాధించింది. వివరాల్లోకి వెళితే... నల్లగండ్లలో నివాసం ఉండే జి. శ్రీనివాస్, శ్రీదేవి దంపతుల కుమార్తె తేజస్వరి చందానగర్‌లో ఇంటర్ చదువుతోంది. రాష్ట్ర, జాతీయ స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటూ అనేక విజయాలు సొంతం చేసుకొని పలువురి మన్ననలను పొందుతోంది.

దేశం తరపున ప్రాతినిధ్యం వహించాలన్నదే లక్ష్యం..

జాతీయస్థాయి పోటీల్లో సీనియర్స్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించడమే నా లక్ష్యం. ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నా. అంతర్జాతీయ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తా. స్కేట్ 9 అకాడమి కోచ్ విశల్ ఉప్పలూరి వద్ద శిక్షణ తీసుకుంటున్నా. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని దేశానికి పతకాలు తేవాలన్నదే లక్ష్యం.

– తేజస్వరి, స్కేటింగ్ క్రీడాకారిణి



సాధించిన పతకాలు..

- 2016లో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బెంగుళూరులో నిర్వహించిన పోటీల్లో పాల్గొని రెండు సిల్వర్ మెడల్స్‌ను సాధించింది.
- 2017లో ఆర్ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్
- 2018లో విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్
- 2019లో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 2 గోల్డ్ మెడల్స్
- 2023 చెన్నైలో ఆర్ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది.
- అదేవిధంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్ణాటకలోని బెల్గావిలో 2016, 2017, 2019లో జరిగిన పోటీల్లో పాల్గొని మూడు సంవత్సరాలు గోల్డ్ మెడల్ సాధించింది.